కథానిక

# జేబుదొంగల బాధితుడు

"పుష్య"

పేవుమీద తొందరగా నడిచిపోతున్నాను. వచ్చే పోయే బళ్లతోటీ, కార్లతోటీ గొప్ప కోలాహలంగా వుంది. నేను ఏదో తీవ్రంగా ఆలోచిస్తూవుండటంవలన మనుష్యులను అంతగా పట్టించి చూడలేదు.

అంతవరకూ కలగనిది, నన్నెవరో వెంబడిస్తున్నట్టు చిన్న అనుమానం కలిగింది. నడుస్తూ వుండగానే తిరిగి చూశాను. నే ననుకున్నది నిజమే. ఆయ నెవరోగాని నన్నంటి పెట్టుకునే నడుస్తున్నాడు. అయినా నే నెందుకు అనుమానపడాలి? ఎవరి పని చూసుకోడానికి వాళ్లు వెళ్ళిపోతూ వుంటారు. అలాంటిది నన్నే వెంబడిస్తున్నాడనుకోవడం తెలివి తక్కువ అనుకొని మళ్ళా వేగంగా నడవడం ప్రారంభించాను.

కాని మనసు ఒక మూల పీకుతోంది. ఏం చెయ్యడానికీ తోచలేదు. ఎందుకింత ఆందోళన? ఆగి అడిగేద్దామా అనుకున్నాను. తీరా అడిగితే ఏమనుకుంటాడో? మళ్ళా తిరిగి చూశాను. ఆయన నడుస్తూ నావేపే చూస్తున్నాడు. ఇంతలో వెనకనుంచి 'అయ్యా' అన్న పిలుపు వినిపించింది. చప్పున ఆగిపోయాను. అనుకున్నది నిజమే. ఆయన నాకోసమే వస్తున్నాడు.

మనిషి చూడబోతే నలభైయేళ్ళకు పైబడ్డవాడిలాగున్నాడు. పంచా, కోటు వేసుకున్నాడు. బాగా మాసిపోయేయి. గడ్డం బాగా పెరిగింది. కళ్లు లోతుకుపోయి నీరసంగా కనిపిస్తున్నాడు.

నేను గాభరాతో ఏం మాట్లాడాలో తెలియక నిశ్చేష్టుడినై నిలుచున్నాను.

"మీతో చిన్న పనుండి వస్తున్నానండి" అన్నాడు.

ఆశ్చర్యమేసింది నాకు. ఆయన ఎవరో, ఏం పని చేస్తున్నాడో, ఎక్కడున్నాడో తెలియదు సరిగదా, నేనెన్నడూ ఆయనను చూడలేదు. అలాంటి అపరిచిత వ్యక్తికి నాతో పనేమొచ్చిందా అనుకున్నాను.

"నాతోనా? ఏంపనండీ?" అన్న మాటలు నా నోటినుంచి అప్రయత్నంగా వెలువడ్డాయి.

"అబ్బే, మరేంలేదండి. నాకసలు పెద్దవాళ్ళతో మాట్లాడడానికే కష్టమనిపిస్తుంది. అంచేత మీలాంటి కుర్రాళ్ళంటే కొంచెం మాట్లాడడానికి మనస్కరిస్తుంది." అని సావధానంగా ఏదో పెద్ద గ్రంథాన్ని వర్ణించేవాడిలాగ ప్రారంభిస్తున్నాడు. తను చెప్పేవన్నీ ఎవరేనా వింటారేమో అన్న భీతితో కాబోలు యిటూ, అటూ చూస్తూ, చెప్పవలసిన విధంగా చెప్పకపోతే నే నెక్కడ వినకుండా వెళ్లిపోతానో అన్న భయంతో ఒక్కొక్క మాటే చెబుతున్నాడు. ఇద్దరం రోడ్డుకు ప్రక్కగా తప్పుకున్నాం.

"మీది ఈ వూరేలా వుంది" అన్నాడు నా సంగతి తెలుసుకోడానికి ఆదుర్దాపడుతున్నవాడిలాగ.

"అవునండీ" అన్నాను ముక్తసరిగా.

"చదువుకుంటున్నారా? లేక ఏదేనా పని..."

"చదువు మొన్ననే పూర్తయింది. ఇంకా ఏ పనీ లేదు" అన్నాను. అక్కడితో ఆ సంభాషణని త్రుంచివేద్దామన్న వుద్దేశంతో. ఆయన మాత్రం,

"బాగానేవుంది. మరేంలేదు. మీతో ఒక విషయం మనవి చేసుకుందామని, తమరు కోపగించుకోక పోతే."

"అబ్బే. ఎంతమాట? చెప్పండి."

అన్నాను. అంత మనిషి ఎదురుగా అంత వినయ విధేయతలతో ఏదో చెబుతానంటూ వుంటే, వద్దనడం మర్యాద కాదని.

"చాలాదూరంనుంచి వచ్చాను. కలకత్తాలో జేమ్సు అండ్ వారెన్ కంపెనీలో పని చేస్తు

న్నానండీ. అకస్మాత్తుగా యీ వూరు రావలసి వచ్చింది.”

అని వూరుకున్నాడు. అయితే ఆయనపనికీ నాకూ సంబంధమేమిటి? ఇంతవరకూ ఆ కథ్యపెనీ పేరయినా వినలేదే. ఆలోచనలతో బుర్ర వేడెక్కి పోతోంది.

“అయితే ఏఁవంటారు?” అనడిగాను.

“చూశారూ, మీరు యీవూరి వారేగనుక, యిక్కడ సంగతులు బాగా తెలిసున్నవారు గనుక చెబుతున్నాను. అప్పుడే వారం రోజులయింది నేనొచ్చి. సత్రంలో బస చేశాను. మర్నాడు పని చూసుకుందాంకదా అని రాత్రి పడుకున్నానండి. ఈ వూరు కూడా అలాంటిదే అని తెలిసుంటే జాగ్రత్తగా వుండివుందును. నాకేం తెలుసు యిలాంటిదని. తెల్లారేక చూద్దునా, ఏముంది? నా సామాన్లు లేవు. జేబులో మనీ పర్సు లేదు. కట్టుకున్న బట్టలతో మిగిలాను.”

దీన స్వరంతో పూర్తి చేశాడు మాటని. ఆయన ముఖ కవళికలు పూర్తిగా మారి పోయాయి. ఆ సమయంలో ఆయన ముఖం చూస్తే ఎవరికైనా జాలేస్తుంది. అనుకోకుండానే ‘అయ్యో’ అన్నాను.

ఆయన తలవాల్చి ఒక్క కన్నీటి బిందువును రాల్చి “ఇప్పుడు నాగతేం కావాలో చెప్పండి. ఇంకెవ్వరూ నాకు నా అన్నవాళ్లు లేరు. పోనీ స్నేహితులేనా వున్నారా అంటే అంతకన్నా లేరు. ఇలా జరిగిందని, డబ్బు పంపమని మా వాళ్లకు వ్రాద్దామంటే చివరకు చేతిలో చిల్లిగవ్వయినా లేకుండా పోయింది.”

అని నిట్టూర్చి కళ్లు తుడుచుకున్నాడు. మరేమీ మాటాడలేదు. ఆతనప్పుడు డబ్బు అవసరంలోవున్నట్టు అర్థమైంది. నా గుండెలో రాయిపడ్డది. ఇంకా ఏమి చెబుతాడా అని ఆయనవేపు చూశాను.

“పెద్దవాళ్లతో యిదిచెప్పుకోడానికి ఎంతో కష్టమనిపిస్తుంది. ఒకప్పుడు బహుగా బతికినవాణ్ణి. అదీగాక యింత వరకూ ఎవరి దగ్గరా చెయ్యి చాచి ఎరగను! సగం చచ్చి మీతో చెబుతున్నాను.”

నాకు మరీ ఆందోళనగావుంది. జేబులో డబ్బులు వేసుకున్నట్టు జ్ఞాపకంలేదు. ఇంతసేపు ఆయన తన దుస్థితిని నాముందు చెప్పుకున్నాక ‘నా దగ్గరేమీ లేదండీ’ అంటే ఆయన మనస్సెంత చివుక్కుమంటుందో. ఆ గాభరాలోనే

“అయితే ఏవంటారు?”

అన్నాను. ఈ మారు జవాబియ్యడానికి కొంచెం సందేహించాడు. దగ్గరగా ఎవరూ లేకుండా చూసి,

“మీరు కనికరిస్తారన్న ఆశతో అడుగుతున్నాను. ఇంకెవరిని అడగటానికీ నా ఒళ్లు చస్తోంది. వారం రోజులనుండి భోజనంలేదు. మీరేమైనా ...”

ఊరుకున్నాడు. జేబులు చూసుకున్నాను. ఒక్క పావలా కాసుంది. వారం రోజులనుంచి భోజనం లేదంటున్న మనిషి చేతులో పావలా కాసెలా పెట్టడం. నాకే ఎంతో సిగ్గువేసింది.

“పని తొందరమీద జేబులో డబ్బులు వేసుకోడం మర్చిపోయానండి. ఒక పావలా కాసు మాత్రం వుంది. మరోలాగ అనుకోకుండా తీసుకుంటే సంతోషిస్తాను.”

అన్నాను మాటలు తడబడుతూ, ఏమనుకుంటాడో అనికించపడుతూ.

“అదే పదివేలండి. లేనిదానికి మీరేం చేస్తారు” అన్నాడు.

మా సంభాషణంతా యింగ్లీషులోనే జరిగింది. నేను తొందర పనిమీద వెళ్లుతున్న విషయం స్ఫురణకు వచ్చింది. గబగబా అడుగువేశాను.

మర్నాడు మా రామం రాగానే జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పాను. చాల విచారించేడు.

జేబు దొంగలమీద చిన్న వుపన్యాసం దొర్లింది. వీళ్లు ఒకొక్కరికి ఎటువంటి యిక్కట్లు కలిగిస్తున్నారో, ఎందరిచేత చేయరానిపనులు చేయిస్తున్నారో, ఎందరిని ఏ స్థితి నుంచి ఏ స్థితికి దిగలాగుతున్నారో, అన్న విషయంమీద నిలుచున్నపాటున ఒక వుపన్యాసం యిచ్చాడు. కొంతసేపటివరకూ వాడినోట్లోంచి యింకా మాటలు దొర్లుతూనే వున్నాయి.

“అదంతా కాదయ్యా, వీళ్ళకు తినడానికి తిండి లేకపోతే, సంపాదించడానికి శక్తి లేక

పోతే, దొంగతనమే చెయ్యాలా అంటాను. ఎందుకు అడుక్కోకూడదూ?''

అన్నాడు వేగిరం యీ విషయం నుంచి విరమించనన్న ధోరణిలో. మావాడి సంగతి నాకు బాగా తెలుసు. ఏ విషయాన్ని పట్టుకున్నా ఒకంతకు గాని వదిలిపెట్టడం జరగదు. అందుచేత నేనేమీ అనకుండా వూరుకున్నాను.

''పాపం, యింతో అంతో గుట్టుగా బతుక్కొస్తున్న ఆ పెద్దమనిషిచేత చెయ్యి చాపించారా. అతనిఒళ్లు ఎంతలా నిలువునా కాలిపోయిందో చెయ్యిచాచి అడగటానికి.''

ఇంకా మావాడికి వుక్రోషం తీరలేదు. నోటికొచ్చినవి ఏవో వాగుతున్నాడు. అక్కడికి ఆ విషయంనుంచి ప్రసంగం మారుద్దామన్న వుద్దేశంతో మరేవో విషయా లడిగాను. వాడు వూరుకోలేదు.

''ఈ జేబుదొంగల నందర్నీ కట్టకట్టి కొరడాలతో కొట్టిస్తేనేగాని బుద్ధి రాదు. పాపం నిన్న ఆయ నయాడు. రేపు నే నవుతాను. అందరిదీ ఒకలాంటిదే నంటావా బాధ?''

చివరకి ఎలాగైతే నేం ఊరుకున్నాడు. వాడన్నదీ నిజమే. ఈ జేబుదొంగల ప్రవర్తన అమాంతంగా ఆ వ్యక్తిచేత చెయ్యి చాపించింది. ఆ రోజల్లా యీ సంగతులతో నే గడిచిపోయింది.

కొన్నాళ్ళకు యీ సంగతే పూర్తిగా మర్చిపోయాను. చాలకాలంవరకూ యీ జేబు దొంగల ప్రసక్తేరాలేదు. ఒకనాటి సాయంత్రం రీడింగు రూమ్‌లో పేపరు చదువుకుంటున్నాను. ఇంతలో రామం హడావిడిగా వచ్చి,

''ఒరే, నీ కోవిషయం చెప్పాలి, రా పోదాం'' అన్నాడు. వాడి ఆతృత చూసి అదేదో చాల గొప్ప విషయం అనుకొని వెంటనే లేచి వెళ్ళాను. ఇద్దరంకలిసి బీచి చేరుకున్నాం.

''నిన్నొక సంఘటన జరిగిందిరా. అది చెబుదామని నిన్నటినుంచి వెదుకుతున్నాను నిన్ను''

ఆ వేదనను, ఆతృతను ఆపుకుంటూ అన్నాడు. నేను మాటాడకుండా కూర్చున్నాను. ప్రారంభించాడు చెప్పడం.

''నిన్న శ్రీపతీ, నేనూ కలిసి కాఫీ హోటలుకు వెళ్ళాం. లోపల కూర్చున్న తరువాత వాడు ప్రిన్సిపాలుగురించి ఏదో ఏకరువు పెడుతూ వుంటే వినడానికి యిష్టం లేకపోయినా వింటున్నాను తప్పదుగదా అని.

''అప్పటికి పదినిముషాల ముందునించి నా వెనకాల ఏవో మాటలు వినిపిస్తున్నాయి. ఇటు తల శ్రీపతి మాటలు వింటున్నాను గనక ఆమాటలు సరిగ్గా వినలేక పోతున్నాను. ఆయ నెవరో పాపం బ్రతిమాలుతున్నాడు ఎదురుగుండా వున్న పెద్దమనిషిని. ఎదురుగా వున్నాయన విననట్టు నటిస్తున్నాడు. ఆయన చెబుతున్న మాటలు వినాలన్న కుతూహలంతో ఆయనవేపు చూశాను.

''మాసిపోయిన పంట్లాం వేసుకున్నాడు. కోటు చిన్న చిరుగు పట్టింది. వయస్సు అతనికి యించుమించు నలభై పైమాటే. ముఖమంతా పాలిపోయింది. విచారంతో క్రుంగిపోతున్నట్టున్నాడు. ఒక చెవిని అటు మళ్ళించాను.

'' 'నేను మీకు శ్రమకలిగిస్తున్నందుకు చాల కించపడుతున్నాను. నేను చెప్పుకు నేది కొంచెం వినండి.'

''అంటున్నాడు. కాని ఎదురుగా వున్నాయన యిది వినిపించుకున్నట్టు లేదు. తన స్నేహితుడితో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నాడు. మళ్ళా అడిగాడు ఆయన.

'' 'అందరినీ నోరు విడిచి అడిగే వాడిని కానండి. నా బాధను తెలుసుకో గలవారని మీతో చెప్పుకుంటున్నాను. తమరు కనికరించకపోతే ప్రాణాలు పోతాయండి.'

'' 'అయితే ఏమంటావయ్యా?'

''అంతవరకూ చెబుతున్న దేదీ విననట్టు నటించిన మనిషి నోటినుంచి ఈ మాటలు వచ్చాయి. చురచుర చూస్తున్నాడు.

'' 'మీరలా కోపగించుకుంటే ఏం చెయ్యగలను చెప్పండి. నేను పైవూరివాడిని. బొంబాయినుంచి యిక్కడకు ఇరవై మైళ్ళ దూరంలోవున్న వూరికి నన్ను బదిలీ చేశారు. దారిలో దొంగలు కట్టుకున్న బట్టలతో సహా ఒలిచేశారండి.'

“అని కళ్ళంట నీళ్ళు బొటబొట కార్చేడు. ఉస్సురని ఒక నిట్టూర్పును బరువుగా వదిలాడు. ఎదురుగావున్న ఆయన మాత్రం కూర్చొని వింటున్నాడు.

“ ‘మీలాంటి వుద్యోగస్తులు నా దుర్భరావస్థను అర్థం చేసుకోగలరని సిగ్గు విడిచి చెప్పుకుంటున్నాను. టిక్కెట్టు సయితం మనీపర్సులో వుండిపోవడంచేత అది కూడా నాకుదక్కకుండా పోయింది. టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేస్తున్నానని టిక్కెట్టు కలక్టరు యిక్కడ దింపేశాడండి. ఇప్పటికి నాలుగు రోజులయింది. భోజనం లేదు, కంటికి కునుకు లేదు.’

“కన్నీరు తుడుచుకున్నాడు. అయినా ఎదురుగా వున్నాయనకు కరుణ కలుగలేదు. అంతా విని ఆయన లేచిపోవడానికి సిద్ధంగా వున్నాడు.

“ ‘అయ్యా! మీకు పుణ్యముంటుంది. ఒక కప్పు కాఫీ అయినా యిప్పించండి. నోరు విడిచి అడుగుతున్నందుకైనా కనికరించండి.’

“ఆ స్నేహితు లిద్దరూ మాటాడకుండా వెళ్లిపోయారు. కొంతదూరం వెళ్ళి నవ్వుకున్నారు. నాకు వొళ్ళు మండింది. అంత కఠిన హృదయులా అనుకున్నాను. పోనీ నేనిద్దామనుకుంటే దగ్గర దమ్మిడీ అయినా లేదు. ఏం చెయ్యను?

“ఆయన మాత్రం అలాగే కుర్చీలో కూలబడ్డాడు. చేసేదిలేక మేము బయటికి వచ్చేశాం.

“నే నెరక్కడుగుతాను. ప్రభుత్వం యీ జేబుదొంగలనని కొంచెమయినా అదుపులో వుంచదేం. అందరినీ అలాంటి బాధలకు గురిచేస్తున్నారు గదా. ఎంత బాధపడ్డాడో పాపం! చివరకి కాఫీకి కూడా చెయ్యి చాచవలసి వచ్చింది.”

మా రామం చెప్పవలసిన దంతా పూర్తి అయిపోయింది. కళ్ళారా చూశాం కాబట్టి జరిగిన సంఘటనలను స్ఫురణకు తెచ్చుకొని విచారిస్తూ కూర్చున్నాం. విచారించి చేసేదేముంది, దేశంలో ఎలాంటి విపరీత చర్యలు జరుగుతున్నాయో అని అనుకోడం తప్ప?

మే మిద్దరం ఈ సంగతులు మాట్లాడుకుంటున్న సమయంలో శ్రీపతి చిన్న నవ్వు ముఖంతో మాదగ్గరకు వస్తూనే.

“ఒరే రామం! నిన్న మనంచూసిన ఆయన్ని పెళ్ళాం పిల్లలతో సహా దింపినట్టున్నాడురా టిక్కెట్టు కలెక్టరు” అని ఫక్కున నవ్వేడు. రామానికి ఇదేమీ అర్థ కానట్టుంది. వెర్రిగా చూశాడు.

“తనొక్కడే బొంబాయినుంచి వస్తున్నానన్నాడు గదా పెళ్ళాం, పిల్లలు ఏమిటి? అదెవరిని చూసి అనుకున్నావో” సందేహాన్ని వెలిబుచ్చుతూ అన్నాడు రామం. దానికి శ్రీపతి,

“పట్టపగలు ఆమాత్రం కనిపెట్టలేననుకున్నావా? ఇవాళ మా నాన్నగారిని దిగబెట్టడానికి స్టేషనుకు వెళ్ళాను. నిన్న మనం చూసిన ఆయన పెళ్ళాం పిల్లల్ని దూరంగా వుంచి ప్లాటుఫారంమీద నిలబడివున్న సూటువాలాతో తన గోడు చెప్పుకుంటున్నాడు. అబద్ధమాడటం వల్ల నాకేం లాభం?” అని ఘండబట్టక శ్రీపతి మరొకసారి నవ్వాడు. వాడి వైఖరి చూసి రామానికి ఒళ్లు మండింది.

శ్రీపతి సంగతి బాగా తెలుసు. ఎప్పుడూ పరిహాస ధోరణే. విచారపడటం, తీవ్రంగా ఆలోచించడం వాడికి చాలా దూరంగా వుంటాయి. అందుచేత వాడన్నదానిని లక్ష్యపెట్ట లేదు మేమిద్దరం.

కొన్నాళ్ళ తరువాత ఏదో మంచి సినిమా వచ్చిందనగానే మా స్నేహితులం అందరం సినిమాకి బయలుదేరాం. హాలుదగ్గర టిక్కెట్లు దొరకడం చాలా కష్టంగా వుంది.

ఇంతలో టిక్కెట్లు కొనడానికి వెళ్ళిన శ్రీపతి గబగబావచ్చి “ఆయన్నిచూడండ్రా” అన్నాడు.

మా అందరి చూపులు అతనివేపు మళ్ళేయి. జేబుదొంగలు తనని కట్టుబట్టలతో వొలిచేరనీ, ఏదైనా సహాయం చెయ్యమనీ బ్రతిమాలుకుంటున్నాడు.

“ఈమారుకూడా ఆయన్ని టిక్కెట్టు కలక్టరు రైలునుంచి దింపినట్టున్నాడురా”

అన్నాడు శ్రీపతి. ఘొల్లుమన్నారు స్నేహితులందరూ.

ఆయనను చూసి రామం, నేనూ విస్తుపోయాం.